జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

కాప్రా: మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా వర్కింగ్ జర్నలిస్టుల (టీయూడబ్లుజే)సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన డైరీని రాష్ట్ర అధ్యక్షులు కే.విరాహత్ అలీ, కోశాధికారి మోతె వెంకట్‌రెడ్డితో కలిసి ఆవిష్కరిస్తున్న జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు. కార్యక్రమంలో జిల్లా టీయూడబ్లుజే అధ్యక్ష ప్రధానకార్యదర్శులు గడ్డమీదిబాలరాజు, దొంతుల వెంకట్రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, వీలైనంత త్వరగా అవసరమైన చర్యలు చేపడతామని వారు అన్నారు.

ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతం

బోడుప్పల్, ఫిబ్రవరి4: ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతానికి గురవుతున్నా పట్టించుకున్న నాథుడే కరువయ్యారని బోడుప్పల్ బీఆర్ఎస్ నాయకుడు బోడగళ్ల సదానంద్ అన్నారు. బోడుప్పల్ రెవెన్యూ పరిధిలోని సర్వేనంబర్ 63బై1లో 1200వందల చదరపు గజాల విలువైన స్థలాన్ని కొందరు యథేచ్ఛగా కబ్జాకు యత్నిస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు.మున్సిపల్ కమిషనర్, రెవెన్యూ అధికారులకు, తహల్దార్, కలెక్టర్‌కు, హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని ఆరోపించారు. సుమారు రూ.7కోట్ల విలువైన స్థలం కాపాడి రక్షణ కంచెను అధికారులు ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

యశ్వంత్‌సాయికి పతకాల పంట

మల్కాజిగిరి, ఫిబ్రవరి 4: పోలీసులు స్పోర్ట్స్ గేమ్‌లో రాణించాలని మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం మల్కాజిగిరి పోలీస్ స్టేషన్‌లో తెలంగాణ పోలీస్ 3వ స్పోర్ట్స్ గేమ్ మీట్-2025 కరీంనగర్‌లో జరిగిన పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా పాల్గొన్న పోలీసుల్లో రాచకొండ కమిషనరేట్ సిబ్బందికి ప్రాతినిధ్యం వహించిన కానిస్టేబుల్ పీయశ్వంత్ సాయి అథ్లెటిక్స్‌లో బంగారు, సిల్వర్ పతకాలను సాధించడంతో సీఐతో పాటు సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ ఆఫీసర్ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

లోన్ ఇస్తామని డబ్బులు కాజేశారు..

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 4 : లోన్ ఇస్తామని ఆశ చూపి ఓ వ్యక్తి నుంచి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేశారు. ఈ సంఘటన ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన ప్రకారం... పోలీస్ స్టేషన్ పరిధిలోని ఘనపూర్‌కు చెందిన మహేందర్ సెల్‌ఫోన్‌కు ఒక్క లింక్ వచ్చింది. ఆ లింక్ ఓపెన్ చేయగా.. లోనుకు సంబంధించినదిగా గుర్తించి అందులో ఉన్న వివరాలను పూర్తి చేశాడు. మరుసటి రోజు మరో ఫోన్‌నంబర్ నుంచి కాల్ వచ్చింది. మీకు లోన్ మంజూరు అయింది... దానికి సంబంధించి పీడీఎఫ్ పంపించి అందుకుగాను జీఎస్టీ, పేపర్ వర్క్, ఐటీఆర్ ఉంటుందని మొత్తం రూ.32,050 లు చెల్లించాలని సూచించారు. దీంతో ఆ డబ్బులను తన గూగుల్ పే, నెట్ బ్యాంకింగ్ నుంచి పంపించాడు. ఆ తర్వాత వారినుంచి ఎలాంటి రెస్పాన్స్ రాలేదు. దీంతో మోసపోయానని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేయగా..కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

శామీర్‌పేట గురుకులంలో విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ భాగ్యలక్ష్మి

మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

క్యాన్సర్ పట్ల అవగాహన ఉండాలి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 4: క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని గైనకాలజిస్ట్ డాక్టర్ అభిలాష అన్నారు. మంగళవారం మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా ఎన్ఎస్ విభాగం, మహిళా సాధికారత విభాగం, అరుంధతి మెడికల్ కాలేజీ సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిగ్రీ కాలేజీ విద్యార్థులు, అరుంధతి మెడికల్ కాలేజీ విద్యార్థులు క్యాన్సర్ వ్యాధి నివారణ నాటిక ప్రదర్శనతో పాటు నేరేడ్‌మెట్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అభిలాష మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ప్రబలుతున్న క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రాజు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ అడవి రాజు, ఎన్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ జీఎన్ జగన్, డాక్టర్ కే హరిత, డాక్టర్ ప్రదీప్, మహిళా సాధికారత విభాగం కన్వీనర్ స్వాతి, మెడికల్ కాలేజీ డీన్ డాక్టర్ ఉదయ్‌కుమార్, డాక్టర్ శశి కిరణ్, ఎంఎల్ఆర్ ఐటీ ఎన్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నాయిని ఉదయ్‌రంజన్ గౌడ్ పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలి

మేడ్చల్: క్యాన్సర్‌పై అప్రమత్తంగా ఉండాలని శామీర్‌పేట సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల వైద్యురాలు డాక్టర్ భాగ్యలక్ష్మి అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినం సందర్భంగా మంగళవారం కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రాణాంతకమైన క్యాన్సర్‌ను ప్రాథమిక దశలో నివారించే అవకాశం ఉంటుందన్నారు. వివిధ రకాల క్యాన్సర్లు , అప్రమత్తత, తీసుకోవాల్సిన చర్యలపై పోస్టర్ ప్రజెంటేషన్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా తమ కుటుంబాల్లో జరిగిన క్యాన్సర్ ఘటనలపై విద్యార్థినులు అనుభవాలను వెల్లడించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఇష్రత్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చేతన, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాలు తెలుపాలి

రాజకీయ నాయకులతో సమావేశమైన ఎంపీడీఓ మమతాబాయి

మేడ్చల్, ఫిబ్రవరి 4 : ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణపై శామీర్‌పేట ఎంపీడీవో మమతాబాయి మంగళవారం రాజకీయ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. మండలంలోని 7 గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితాను వార్డుల వారీగా గత ఏడాది సెప్టెంబరు 28న, నవంబరు 30న ప్రకటించారు. ఆ జాబితాపై అభ్యంతరాల స్వీకరణకు ఎంపీడీవో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో తన కార్యాలయంలో సమావేశమై చర్చించారు. అభ్యంతరాలు ఉంటే తెలుపాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ రాజకీయ పార్టీల నాయకుల అభ్యంతరాల ఉంటే తీసుకొని, తుది జాబితా త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

రేపటి నుంచి అయోధ్య రైల్వే గేట్ బంద్

మేడ్చల్, ఫిబ్రవరి 4 : మేడ్చల్-గండిమైసమ్మ దారిలో అయోధ్య చౌరస్తాకు సమీపంలో ఉన్న రైల్వేగేట్‌ను ఈనెల 6వ తేదీ నుంచి 9వ తేదీ వరకు మూసివేయనున్నట్టు ట్రాఫిక్ సీఐ హనుమాన్ గౌడ్ తెలిపారు. గేట్ వద్ద రైల్వే లైన్ మరమ్మతుల కారణంగా నాలుగు రోజుల పాటు గేట్‌ను మూసి వేస్తున్నామన్నారు.

ఆ దారిలో ప్రయాణించే వారు ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని ఆయన సూచించారు.

ప్రాచ్యలిఖిత గ్రంథాలపై అవగాహన

అవగాహన సదస్సులో ప్రాచ్య లిఖిత పత్రాలను విద్యార్థులకు ఇస్తున్న సంస్థ ప్రతినిధులు.

రామంతాపూర్, ఫిబ్రవరి 4: రాతప్రతులపై తెలంగాణ ప్రభుత్వ ప్రాచ్య లిఖిత గ్రంథాలపై మంగళవారం అవగాహన సదస్సు అవగాహన సదస్సు నిర్వహించారు. రాతప్రతులైన 18 రకాల వస్తువులపై పూర్వంలో రాసిన పీపీటీ ద్వారా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర గ్రంథాల చైర్మన్ ప్రొఫెసర్ ఎండీ రియాజ్ మాట్లాడుతూ ఉర్దూ, అరబిక్,పర్షియన్ ,సంస్కృతం, తెలుగు విభాగాలకు సంబంధించిన తాళపత్ర,పేపర్ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. రామంతాపూర్ పబ్లిక్ స్కూల్ తెలుగు అధ్యాపకురాలు ప్రమీల ఆధ్వర్యం లోపలువురు విద్యార్థులు హాజరైనారు. వారికి ప్రాచ్యలిఖిత గ్రంథాల గూర్చి అనేక విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డిడి, అరుణ,తెలుగు పరిశోధకురాలు వాసంతి,ఉర్దు,అరబిక్ పరిషియన్ సహాయకురాలు తన్వీర్ ఫాతిమా, సంస్కృత సహాయ పరిశోధకులు డాక్టర్ అబ్దుల్ ఘని,వెంకటనారాయణ, సత్యనారాయణమూర్తి ఉన్నారు.

రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడుగా అచ్చిని నర్సింహ

అచ్చిని నర్సింహ

పోచారం,ఫిబ్రవరి4: రాష్ట్ర బీజేపీ కౌన్సిల్ సభ్యుడుగా పోచారం మున్సిపాలిటీ ఇస్మాయిల్‌ఖాన్‌గూడకు చెందిన అచ్చిని నర్సింహను నియమించారు.గతంలో పార్టీలో పలు పదవులు నిర్వహించిన ఆయ నకు సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం మరోసారి రాష్ట్ర కౌన్సిలర్ సభ్యుడుగా 2వ సారి నియమించిందని మున్సిపాలిటీ అధ్యక్షుడు సురేష్ నాయక్ తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలి

జడ్సీ రవి కిరణ్‌కు వినతిప్రతం అందజేస్తున్న కార్పొరేటర్ సునీతారాముయాదవ్

మల్కాజిగిరి, ఫిబ్రవరి 4: అభివృద్ధిపనులకు ప్రభుత్వం నిధులు కేటాయించాలని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ సునీతా రాము యాదవ్ కోరారు. మంగళవారం గౌతంనగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధిపనులకు నిధులు కేటాయించాలని సికింద్రాబాద్‌లోని జోనల్ కమిషనర్ రవి కిరణ్‌కు కార్పొరేటర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధిపనులకు ప్రభుత్వం నిధులు కేటాయించడంతో విఫలమైయిందన్నారు. ఇప్పటికే జరుగుతున్న అభివృద్ధిపనులక నిధులు లేక పోవడంతో అభివృద్ధిపనులు జరగడం లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో మేకల రాముయాదవ్, అచ్యుతరావు, శ్రీనివాస్, నర్సింగ్ రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్

పోలీసుల అదుపులో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్ యాదవ్

మేడ్చల్, ఫిబ్రవరి 4 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అసెంబ్లీకి వెళ్లనున్న నేపథ్యంలో శామీర్‌పేట మండలంలోని బీఆర్ఎస్ నేతలను మంగళవారం ముందస్తుగా అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సరసం మోహన్ రెడ్డి, మాజీ సర్పంచ్ గుర్క కుమార్ యాదవ్‌ను సీఐ శ్రీనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం వారి ఇండ్ల వద్ద అరెస్ట్ చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సరసం మోహన్ రెడ్డి మాట్లాడుతూ అరెస్ట్‌లు, నిర్బంధాలతో బీఆర్ఎస్‌ను అడ్డుకోలేరన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ సారధ్యంలో ప్రభుత్వ రైతు, వ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తామన్నారు.

రాష్ట్ర ప్రజలు రైతుతో పాటు అన్ని వర్గాల సంక్షేమానికి పాటు పడిన కేసీఆర్ పాలననే ప్రజలకు కోరుకుంటున్నారన్నారు. భవిష్యత్ బీఆర్ఎస్‌దేనని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఘోర పరాభవం తప్పదని ఆయన హెచ్చరించారు.

యాంటీ కరప్షన్ ఫౌండేషన్ రాష్ట్రవైస్ చైర్మన్‌గా శ్రీనివాస్

జనగాం శ్రీనివాస్

రామంతాపూర్,ఫిబ్రవరి 4 : యాంటీ కరప్షన్ ఫౌండేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా రామంతాపూర్‌కు చెందిన జనగాం శ్రీనివాస్‌ను నియమిస్తూ జాతీయ అధ్యక్షులు సంజీవ్ శర్మ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం ఆయన చేతుల మీదుగా నియామకపు పత్రం అందుకున్న శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వానికి న్యాయసంస్థలకు సయన్వయ కర్తగా పనిచేస్తానన్నారు. తనను నియ మించిన జాతీయ అధ్యక్షులు సంజీవ శర్మకు కృతజ్ఞతలు తెలిపారు.

చెరువు,నాలాల కబ్జాలు అడ్డుకోవడంలో అధికారులు విఫలం

నాలాకు అనుకొని కొనసాగుతన్న అక్రమ నిర్మాణం

చర్లపల్లి, ఫిబ్రవరి4: చర్లపల్లి చెరువు నాలా కబ్జాకు గురైతున్న సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారని చర్లపల్లి కాలనీల సమాఖ్య అధ్యక్షుడు ఎంపెల్లి పద్మారెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని కుషాయిగూడ శివసాయినగర్‌లో ఆయన మాట్లాడుతూ చిన్న చర్లపల్లి నుంచి ఇందిరాగృహ కల్ప కాలనీకి వెళ్లే రహదారిలో ఉన్న చెరువు నాలా కబ్జాకు గురవుతుందని, నాలాకు అనుకొని ఉన్న బఫర్ జోన్‌లలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నా రు. కబ్జాల విషయమై గతంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుం డా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత రెవెన్యూ, సర్కిల్ అధికారులు దృష్టి సారించి కబ్జాలకు తొలగించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

'లక్ష డప్పులు..వేల గొంతులు' పోస్టర్ విడుదల

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మేడ్చల్, ఫిబ్రవరి 4 : మూడుచింతపల్లి మండల కేంద్రంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో లక్ష డప్పులు.. వేల గొంతులు పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్‌మూడు చింతపల్లి మండల అధ్యక్షుడు నల్ల కృష్ణ మాదిగ మాట్లాడుతూ 30 ఏండ్ల సుదీర్ఘ పోరాటం తర్వాత ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిందని, రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలుకు సిద్ధమైందన్నారు.

అయితే మాల వర్గానికి చెం దిన వారు అడ్డుకునేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. దీన్ని తిప్పి కొట్టేందుకు మంద కృష్ణ మాదిగ లక్ష డప్పులు..వేల గొంతుల కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈనెల 7న ఉదయం 11 గంటలకు ఎల్బీస్టేడియంలో జరిగే కార్యక్రమానికి పెద్ద ఎత్తున మాదిగలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింలు, జాంగీర్, మిర్యాల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

కీసర, ఫిబ్రవరి 4: మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు ఇవ్వకపోవడంతో వారు మంగళవారం ఆందోళనకు దిగారు. దమ్మాయిగూడ మున్సిపాల్టీ పరిధిలోని చీర్యాల్ వార్డు కార్మికులకు మూడు నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి. శివబాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడు కూడా ఇంతవరకు జీతాలు ఇవ్వకుండామొండివైఖరికి నిరసనగా కార్మికులు రోడ్డు ఎక్కారని అన్నారు. కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపుమేరకు ఈసీఐఎల్ నుంచి నిరసన ర్యాలీని నిర్వహించారు. కార్మికులకు వెంటనే 8 గంటల పనిదినాలను అమలు చేయాలని, కనీస వేతనం రూ.26వేలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆదర్శ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు, ఐఎఫ్‌టీయూ నాయకులు రవి నారయ్య, రవీందర్, సాయులు, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

చీర్యాల్ వార్డు కార్యాలయం ఎదుట నిరసనకు దిగిన మున్సిపల్ కార్మికులు

నేటి ధర్నాను జయప్రదం చేయండి

మేడ్చల్, ఫిబ్రవరి 4: బీసీ హక్కుల సాధన కోసం బుధవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నా జయప్రదం చేయాలని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు దశరథ్ అన్నారు. శామీర్‌పేటలో మంగళవారం బీసీ హక్కుల సాధన సమితి ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రజలందరికి జాతి, కుల, వర్గ, లింగ వివక్ష లేకుండా సమానత్వాన్ని, సమాన అవకాశాలను కల్పించిందన్నారు. జనాభాలో సగానికి పై గా ఉన్న బీసీలకు మాత్రం సమాన హక్కులు లభించడం లేదన్నారు. బీసీ సామాజిక వర్గానికి న్యాయం జరగాలంటే బీసీ గణన జరగాల్సిందేనన్నారు. దేశ వ్యాప్తంగా బీసీ గణన చేపట్టి, జనాభా ప్రకారం అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ హక్కుల సాధన కోసం నిర్వహించే ధర్నాకు భారీగా తరలిరావాలని బీసీలను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ హక్కుల సాధన సమితి నాయకులు నరేంద్ర ప్రసాద్, నిమ్మల నర్సింహ, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ సాంకేతిక నిపుణుడిగా కూరపాటి రాజశేఖర్

కూరపాటి రాజశేఖర్

జవహర్‌నగర్, జనవరి 4: జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు సాంకేతిక నిపుణుడిగా కూరపాటి రాజశేఖర్ ఎంపికయ్యాడని సీఆర్‌పీఎఫ్ పాఠశాల ప్రిన్సిపాల్ డి.అపర్ణ, ఫిజికల్ డైరెక్టర్ భాస్కర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దేశస్థాయి పోటీలకు ఎంపికైన సీఆర్‌పీఎఫ్ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ కూరపాటి రాజశేఖర్‌ను పాఠశాల బృందం శుభాకాంక్షలు తెలిపారు. ఈనెల 8-12వరకు జరిగే జాతీయస్థాయి పోటీల్లో రాజశేఖర్ సాంకేతిక నిపుణుడిగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులను ఉన్నత శిఖరాలకు తీర్చిదిద్దనందుకే నాకు దేశస్థాయిలో అత్యుత్తమ స్థానం లభించిందని రాజశేఖర్ తెలిపారు. దేశస్థాయి సాంకేతిక నిపుణిడిగా ఎంపికవ్వడంతో నాపై మరింత బాధ్యత పెరిగిందని, క్రీడాకారులకు జాతీయస్థాయిలో రాణించేలా కృషి చేస్తానన్నారు. డీఐజీపీ అనిల్‌మింజ్, ఆశాజీకు మార్, హరిశంకర్, ఉపాధ్యాయులు, క్రీడాకారులు అభినందనలు తెలియజేశారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



ఘట్‌కేసర్‌లో వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలను వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ రవీందర్

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 4: ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఘట్‌కేసర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వై.రవీందర్ అన్నారు.ఘట్‌కేసర్ పట్టణంలోని యంనంపేట్ చౌరస్తా వద్ద రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలను వివరించారు.మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మల్లయ్య, కానిస్టేబుల్ ఇబ్రహీం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోల్డ్ మెడల్ సాధించిన కానిస్టేబుల్‌కు సన్మానం

ఘట్‌కేసర్ పోలీసు స్టేషన్‌లో రాష్ట్ర స్థాయి క్రీడల్లో గోల్డ్ మెడల్ సాధించిన మానసను సన్మానిస్తున్న ఇన్‌స్పెక్టర్ పరశురాం

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 4: రాష్ట్ర స్థాయి పోలీసు క్రీడల్లో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించిన ఘట్‌కేసర్ ఉమెన్ కానిస్టేబుల్‌ను ఘట్‌కేసర్ పోలీసులు ఘనంగా సన్మానించి అభినందించారు. గతనెల 31న కరీంనగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి క్రీడల్లో ఘట్‌కేసర్ ఉమెన్ కానిస్టేబుల్ జి మానస(7117)పాల్గొని కబడ్డీలో గోల్డ్ మెడల్, ఆమ్స్‌రెజ్లింగ్‌లో రజత మెడల్ సాధించింది. రాష్ట్ర సాయి క్రీడల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరిచి గోల్డ్, బ్రాస్ మెడల్ సాధించి పోలీసు స్టేషన్‌కు గుర్తింపు తీసుకువచ్చినట్లు ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు ప్రభాకర్‌రెడ్డి, జి నర్సింహ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు అదృశ్యం

గణేష్(ఫైల్)

శ్రీనివాసరావు(ఫైల్)

జవహర్‌నగర్, ఫిబ్రవరి 4: జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు అదృశ్యమయ్యారు. ఎస్‌హెచ్‌వో సైదయ్య కథనం ప్రకారం... జవహర్‌నగర్ కార్పొరేషన్ గబ్బిలాల్‌పేట్ రాజీవ్‌గాంధీనగర్‌లో గణేష్, భార్య రాజేశ్వరి, ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తున్నారు. గణేష్ మరో మహిళతో అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తూ... అధికంగా మద్యానికి బానిసై తరచూ భార్యతో గొడవ పడుతూ వేధింపులకు గురిచేసేవాడు. ఈ క్రమంలో గతనెల 2న గణేష్ ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి బయలు వెళ్లి ఇంత వరకు తిరిగి రాలేదు. గణేష్ ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. భార్య రాజేశ్వరి పోలీసులకు ఫిర్యాదు చేసింది.ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల భారంతో...

అప్పుల భారంతో మనస్థాపం చెందిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. కాప్రా మండల పరిధి సాకేత్‌కాలనీలో నైషదామ్ శ్రీనివాసరావు, భార్య వాసుజా, కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారు. గత కొంత కాలంగా నైషదామ్ శ్రీనివాసరావు అప్పులు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 2న ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతని ఆచూకీ కోసం వెతికినా సమాచారం లభించలేదు. అప్పులు తిర్చిన తర్వాతే ఇంటికి వస్తానని శ్రీనివాసరావు భార్యతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే కట్ చేశాడు. కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సినిమాల్లో అవకాశాల పేరుతో మోసం.. వ్యక్తిపై కేసు

పీర్జాదిగూడ, ఫిబ్రవరి4: సోషల్ మీడియాలో పరిచమై సినిమాల్లో అవకాశాలు కల్పిస్తానని లక్షల్లో వసూళ్లు చేసి తప్పించుకు తిరుగుతున్న ఓ ప్రభుద్దుడిపై కేసు నమోదైన సంఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితులు కథనం ప్రకారం... బోడుప్పల్ కార్పొరేషన్ శ్రీనివాస్ నగర్‌కాలనీకి చెందిన వెంకటనర్సింహరాజు స్థానికంగా వెంకటలక్ష్మీనర్సింహ ప్రొడక్షన్ పేరుతో సోషల్ మీడియాలో పరిచయమైన ఖమ్మం జిల్లా సత్తుపల్లికి చెందిన అక్కాతమ్ముళ్లు సునీత, శివకుమార్‌లకు చిత్ర హీరోలు సుమన్, భానుచందర్, ప్రియమణిలతో నిర్మిస్తున్న అంతేనా ఇంకేమి కావాలి అనే చిత్రంలో క్యారెక్టర్ ఆర్టిస్టుగా అవకాశాలు ఇప్పిస్తానని ఇద్దరి నుంచి రూ. 8లక్షలు వసూలు చేసి దాటస్తున్నాడని. డబ్బులు ఇవ్వమని అడిగితే తమపై అసభ్యంగా మాట్లాడుతూ తప్పించుకుతిరుగుతున్నాడని గతనెలనెల 21వ తేదీన మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఫిర్యాదు చేసి పద్నాలుగు రోజులైన పోలీసులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోడ దూకి పాఠశాలలోకి విద్యార్థుల ప్రవేశం

మేడ్చల్, ఫిబ్రవరి 4: ఉపాధ్యాయులు నిర్వాకంతో గోడదూకి పాఠశాలలోకి వెళ్లాల్సిన దుస్థితి విద్యార్థులకు ఏర్పడింది. మేడ్చల్ పట్టణంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ఉదయం పాఠశాలకు చేరుకున్నాయి. సమయం 9 గ